క్లుప్తంగా

మొక్కుబడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి, ఎంపీపీ వీరాస్వామి

చాగల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టా వీరస్వామి ఆధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావేశంలో ఎటువంటి చర్చలు జరగలేదు. అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు, ఆమోదాలు లేకుండా సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సాహితీవేత్తల శ్రమను నేటి తరానికి తెలపాలి



మాతృభాషా దినోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు: తెలుగు భాష కోసం కృషి చేసిన గొప్ప సాహితీవేత్తల శ్రమను నేటి తరానికి తెలిపే బాధ్యతను తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఉపాధ్యాయులను కోరారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మాతృభాషపై విద్యార్థుల్లో అనురక్తిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆంగ్లంతో పాటు మాతృభాష అవసరాన్ని విద్యార్థులకు తెలపాలని సూచించారు. తమిళనాడు తరహాలో తెలుగువారు సైతం మాతృభాష కోసం దోహదపడాలన్నారు. మాతృభాష పరిరక్షణ కోసం, తెలుగు భాష వ్యాప్తికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ పద్మావతి, కూటమి నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, తిరుపతి సత్యనారాయణ, మోర్త ప్రమోద్‌కుమార్, బండి సత్యనారాయణ, కేదారిశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరదలిని వేధిస్తున్న బావ అరెస్ట్

నల్లజర్ల: మరదలిని వేధిస్తున్న బావను స్థానిక పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ప్రకాశరావుపాలెంలో గురువారం రాత్రి మరదలను బావ వేధించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడు కొత్తపల్లి వెంకటేష్‌ను శుక్రవారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ సోమరాజు తెలిపారు.

కూటమి అభ్యర్థికి ఓటు వేయండి

పెరవలి: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని మంత్రి కందుల దుర్గేష్ కోరారు. పెరవలి మండలం ఖండవల్లిలో ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కృతనిశ్చయంతో ఉందని అందుకు ఈ ఎన్నికల్లో కూటమి బలపరిచి పేరాబత్తుల రాజశేఖరంకు ఓటు వేయాలని కోరారు. యువతతో మాట్లాడి, ఓటు ఏ విధంగా వేయాలో యువతకు నమూనా బ్యాలెట్ పేపర్ చూపించి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో కూటమి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత తమ తొలి ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు వేసి గెలిపించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్వీఆర్‌కే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం మంత్రి కందుల దుర్గేష్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేసి, తమ తొలి ప్రాధాన్యత ఓటు పేరాబత్తుల రాజశేఖరంకు వేసి గెలిపించవలసిందిగా పట్టభద్ర ఓటర్లను మంత్రి దుర్గేష్ అభ్యర్థించారు. ప్రిన్సిపాల్స్ బట్టు గీతాంజలి, కంబయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రిఫ్రిజిరేటర్, ఏసీ సర్వీసింగ్‌లో శిక్షణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 24 నుంచి రిఫ్రిజిరేటర్, ఏసీ రిపేర్ సర్వీసింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని ఆ సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు ఉండాలన్నారు. శిక్షణ సమయంలో భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలవారు 0883-242024, 2428807, 97013 59954, 90143 28803 నంబర్లను సంప్రదించాలన్నారు.

పరిమితికి లోబడే ఎరువులు వాడాలి



ధర్మవరంలో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

కొవ్వూరు: దాళ్వా వరి సాగు చేసే రైతులు పరిమితికి లోబడే ఎరువులు వాడుకోవాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ధర్మవరంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర సందర్శన చేశారు. ప్రస్తుతం దాళ్వా వరి పంట ఆరోగ్యవంతంగా ఉందన్నారు. చిరుపొట్ట దశ నుంచి గింజ పాలుపోసుకునే దశలో ఉందని, ఆఖరి సారిగా ఎకరాకు 50 కిలోల యూరియా, మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ 20 కిలోలు వేసుకోవాలని సూచించారు. డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ దాళ్వా సాగులో చీడపీడల ప్రభావం తక్కువగా ఉందని, ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా వచ్చే అవకాశం ఉందన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చాన్నారు. అనంతరం రైతు కాకర్ల సురేష్‌బాబు పొలంలో పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.గంగాధర్, ఏఈవో ఎన్.శ్రీనివాస్, వీఏఏ జ్ఞానదాస్, అభ్యుదయ రైతులు కుందుల రమేష్, కుందుల మోహన్, పూలప గోపాలకృష్ణ, పెన్నెటీ రమేష్, కాకర్ల సురేష్ బాబు పాల్గొన్నారు.

భవితకు బంగారు బాటలు వేసుకోవాలి

తాళ్లపూడి: విద్యార్థులు ఇంటర్‌లోనే తన బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎస్సై టి.రామకృష్ణ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రక్షక్ టీం సభ్యులు మాట్లాడుతూ కాలేజీలో చదివే విద్యార్థినులు ఫ్రెండ్స్‌తో సైతం జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మొబైల్స్ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. బాలికలు, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్సై రామన్న, రక్షక టీం సభ్యులు శైలజ, అనిత, భవాని, భవ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు

మాతృభాషతోనే మానవజాతి మనుగడ



ర్యాలీ చేస్తున్న బీఈఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: నీతి, నిజాయితీ, మంచి నడవడికను నేర్పేది మాతృభాష అని ప్రముఖ కవి, రచయిత, తెలుగు భాషాభివృద్ధి సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గూటం స్వామి అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బొమ్మూరులోని జీపీఆర్ ఉన్నత పాఠశాలలో ఫిలాంత్రోపిక్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఎం.నరసింహారెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ తల్లి భాష నేర్చుకోకపోతే మానవజాతి మనుగడ లేదన్నారు. అనంతరం గూటం స్వామిని తెలుగు తేజం బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలో కాంస్య పతకం సాధించిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం.నవీన్, రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈఈఎంటీ – 2025 పరీక్షలో జిల్లా టాపర్‌గా నిలిచిన పదో తరగతి విద్యార్థి కె.జగదీష్‌కు నగదు బహుమతి అందించారు.

పరభాషా పదాలతో అనర్థం

సీటీఆర్ఐ: పరభాషా పదాలను విచ్చలవిడిగా వాడటం వల్ల తెలుగుభాషకు అనర్థం కలుగుతుందని జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ, కళాగౌతమి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంగ్లిషు పదాలకు తెలుగు పదాలను సృష్టించుకోవాలన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ అంతర్జాలంలో తెలుగును విరివిగా వాడాలన్నారు.

- మాతృభాషను కాపాడుకోవాలని విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రత్యేక కార్యక్రమాలు

కంబాలచెరువు: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కాలనీలోని బీఈఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ బి.చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయురాలు బి.శారద తదితరులు తెలుగు తల్లి చిత్ర పటాన్ని పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయురాలు మనోజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను మరువొద్దు


కడియం: జన్మనిచ్చిన మాతృమూర్తిని, మాతృభాషను మరువరాదని హెచ్ఎం టి.సత్యనారాయణ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మాతృభాషా దినోత్సవ ప్రత్యేకతను వివరించారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

విద్యా సుమాలు.. క్రీడా యోధులు

ప్రకాశం నగర్: చదువుతో పాటు క్రీడలపై చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. విద్యలో రాణిస్తూనే తమకు నచ్చిన క్రీడలో శిక్షణ పొందుతున్నారు. బాలురతో పాటు బాలికలు కూడా ఇదే పంథాలో నడుస్తున్నారు. ఈ నేపథ్యంలో కరాటే విద్యను ఇటీవల ఆదరణ బాగా పెరుగుతోంది. ఆత్మరక్షణ కోసం కొందరు, హాబీగా మరి కొందరు విద్యార్థులు ఈ విద్యను నేర్చుకుంటున్నారు. వీరిలో కొందరు క్రీడాకారులు సెల్ఫ్ టెక్నిక్స్ విభాగంలో పలు మెళకువలు నేర్చుకుంటూ, ప్రత్యర్థిని మట్టి కరిపించే రీతిలో శిక్షణ తీసుకుంటున్నారు. కరాటేలో మంచి ప్రతిభను కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయాలు సాధించి పలు పతకాలు సాధిస్తున్నారు. ప్రస్తుతం సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కరాటే వంటి శిక్షణ వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచడంతో పాటు, ఆపదను తప్పించుకోవడానికి వీలుగా ఉంటుందని శిక్షకులు చెబుతున్నారు. అయితే మిగిలిన క్రీడలతో పోల్చితే కరాటేకు కఠోరమైన శిక్షణ, ఏకాగ్రత, క్రమశిక్షణ అవసరం. ఇవి లేకపోతే ఈ విద్యలో రాణించడం సులభం కాదు.

జాతీయ స్థాయిలో పతకాలు

కాకినాడ ఇంద్రపాలెంలోని సుబ్బిరామిరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన విక్టరీ షోటో ఖాన్ కరాటే జాతీయ స్థాయి పోటీల్లో కటాస్ స్పరింగ్ 12, 19 ఏళ్ల విభాగాల్లో నగరానికి చెందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. వారిలో సీహెచ్ నిషిత్, ఎం.ప్రసన్న, వెంకట నాగసూర్యశ్రీ బంగారు పతకాలు సాధించారు. ఆర్.మనోజ్ఞ, డి.చిన్మయ, వి.ఇందు, సీహెచ్ సునంద వెండి పతకాలు గెలుచుకున్నారు. కె.చరణీ కృతి, జి.స్టీఫెన్ రాహుల్, కె.రుత్విక్, వి.అఖిల్‌తేజ్ కాంస్య పతకాలు పొందారు.



కరాటేలో ప్రతిభ చూపిన చిన్నారులను అభినందిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

విజేతలకు అభినందనలు

జాతీయ స్థాయి కరాటే పోటీలో పతకాలు సాధించిన విద్యార్థులను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ప్రత్యేకంగా అభినందించారు. సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కరాటే మాస్టర్ పి.అరుణ్ కుమార్‌తో పాటు ఆయా పీడీలకు అభినందనలు తెలిపారు.

కొరవడిన ప్రభుత్వ సాయం

క్రీడల్లో విద్యార్థులు రాణించి, పలు పతకాలు సాధించినప్పటికీ వారికి శిక్షణ, ప్రోత్సాహం అందించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని పలువురు సీనియర్ క్రీడాకారులు అభిప్రాయపడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రీడాకారులకు స్కూల్స్ గేమ్స్‌తో పాటు ఆడుదాం ఆంధ్ర వంటి పోటీలను నిర్వహించి గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు చర్యలు తీసుకుంది. ఆటల పోటీలు నిర్వహించడంతో పాటు విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందించి, వారికి ఆర్థికంగా చేయూత నిచ్చింది.

వర్జీనియా పొగాకు పంట కోత ప్రయోగం

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటలో శుక్రవారం వర్జీనియా పొగాకు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. రైతులు దుగ్గిరాల సుబ్బారావు, పోసిన నారాయణరావు పొలాల్లో ప్రయోగాలు చేశారు. ఈ సందర్భంగా మండల ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రబీ సీజన్‌లో పోచవరం, అన్నదేవరపేట గ్రామాల్లో వర్జీనియా పొగాకు పంటకోత ప్రయోగాలు చేపట్టామన్నారు. రైతులు ఆకులు వేరు చేసే సమయంలో వీఏఏలకు తెలియజేయాలని, తాము నిర్దేశించిన ప్రదేశంలోని ఆకులను ప్రత్యేకంగా ఉడికించి గ్రేడ్ చేయాలన్నారు. పచ్చి ఆకులు, ఎండిపోయిన ఆకుల తూకం నమోదు చేసుకొని ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో అన్నదేవరపేట సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.సతీష్, రైతులు సుబ్బారావు, నారాయణ, సాయి పాల్గొన్నారు.



అన్నదేవరపేటలో పొగాకు పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న ఏఎస్‌వో

నిర్దేశించిన ప్రకారమే రీ సర్వే చేపట్టాలి



రీ-సర్వే పనులను పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు

గోకవరం: నిర్దేశించిన ప్రకారమే భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మండలంలోని మల్లవరంలో జరుగుతున్న రీ సర్వే పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సగటున సర్వే బృందాలు రోజుకు 15 ఎకరాల్లో సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. ఇందు కోసం 139 బృందాలను నియమించామని పురోగతి ఆ మేరకు లేదన్నారు. దేవరపల్లి మండలంలో 59.84 ఎకరాల్లో, గోకవరం మండలంలో 44.9 ఎకరాల్లో సర్వే పూర్తి చేయగా పురోగతిలో కొవ్వూరు 15.75 ఎకరాలు, గోపాలపురం 22.52 ఎకరాలతో దిగువన ఉన్నాయని తెలిపారు.

ఆకుకూరలతో ఆరోగ్యానికి మేలు

ఉండ్రాజవరం: అత్యంత పోషక విలువలు కలిగిన ఆకుకూరలు తినడం ద్వారా అనేక అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చని వెలగదుర్రు సర్పంచ్ సాగి పద్మావతి అన్నారు. పోషణ్ వాటిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెలగదుర్రులో అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పండించిన ఆకుకూరలను శుక్రవారం గర్భిణులు, బాలింతలకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, ఆకుకూరలు, పండ్లు తినడం వలన మంచి ఆరోగ్యంతో పాటు సాధారణ ప్రసవం అయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ముదునూరి ప్రసాదరాజు, ధనిశెట్టి మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దుర్గా భవాని, మహిళా సంరక్షణ కార్యదర్శి బి.మేరి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఉండ్రాజవరం: తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం హాస్పిటల్ సౌజన్యంతో మండలంలోని వడ్లూరులో శ్రీసీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఈసీజీ, కంటి, ఎముకలు, ప్రసూతి, చెవి ముక్కు, నరాలకు సంబంధించిన వ్యాధులకు నిపుణులైన వైద్య బృందం రోగులకు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 100 మందిని పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం మస్తాన్‌రావు, కఠారి సిదార్థరాజు, అక్కిన కాశీ విశ్వనాథం, వి.పార్వతమ్మ, పవన్‌రాజు, సత్యనారాయణ రాజు, సర్పంచ్ రఘు మండ తేజశ్రీ, వేండ్ర రమేష్, పంపన త్రిమూర్తులు, వేములమంద సీతారాం, పెన్మత్స వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు

నిడదవోలు రూరల్: చోరీలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని ఎస్సై కె.వీరబాబు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చోరీలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాధ్యమైన మేర ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పొరుగు గ్రామాలకు వెళ్లే సందర్భంలో విలువైన వస్తువులు ఇళ్లల్లో ఉండరాదన్నారు. ఇటీవల కాలంలో జరిగిన చోరీలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.